అత్తగారూ-నీళ్లబండి బసవయ్యా

భానుమతీ రామకృష్ణ

తోటలో యిల్లు కట్టుకోవాలని ఉబలాట పడ్డామేగాని మంచినీళ్ల సంగతి ఆలోచించలేదు. తోటలో వున్న రెండు బావుల నీళ్ళూ ఉప్పుగాకపోయినా బురద నీళ్లు. పూలమొక్కల కోసం, వరిపంట కోసం రెండు పంపుసెట్లు పెట్టించినందువల్ల నీళ్లు బురదగానూ, మడ్డిగానూ వుంటాయి.

మా అత్తగారి మడినీళ్లు అవే అయినా మాకు ఆ నీళ్లు తాగాలంటే గొంతు పట్టుకుంటుంది. ప్రతిరోజూ కారు యింటి నుండి ఎన్నిసార్లు బయటి కెళితే అన్నిసార్లు మా పాత యింటి నుంచి, కుళాయి నీళ్లు రెండు పెద్ద డ్రమ్ముల్లో తెప్పిస్తూండేవాళ్లం. ఏ రోజైనా డ్రైవర్ నీళ్లడ్రమ్ములు కార్లో పెట్టడం మర్చిపోతే యిక ఆరోజు మాకు బావి నీళ్లే శరణ్యం.

ఆ తెచ్చే రెండు డ్రమ్ముల నీళ్లకూ మా తోటలో దొంగలుండేవాళ్ళు.. మా కాపలావాడి పెళ్ళాం, మా తోటవాడి పెళ్ళాం.. యిద్దరూ చెరోరెండు బిందెలూ పుచ్చుకుని రెడీగా వుండేవాళ్ళు. కారు వస్తూనే డ్రైవర్ను మంచి చేసుకుని గేటు దగ్గరే కారాపి డ్రమ్ముల్లో వున్న నీళ్ళు బిందెల నిండా నింపుకుని కారు లోపలికి వదిలేవాళ్ళు... నేను ఒకరోజు చూసి మా అత్తగారికి తెలిస్తే గొడవవుతుందని మాట్లాడకవూరుకున్నాను.కాని డ్రమ్ముల్లో సగం నీళ్ళు తగ్గడం మా అత్తగారు ఒకటి రెండు సార్లు అడిగారు "ఏమిట్రా 'సగం నీళ్లే తెస్తారు'.. అంత పెట్రోలు ఖర్చుపెట్టి అంత దూరాన్నుంచి నీళ్లు తెప్పిస్తుంటే, యీవిధంగా సగం డ్రమ్ములు, పట్టుకొస్తారేమిట్రా' అని.

"లేదు పెద్దమ్మగారూ! డ్రమ్ముల నిండుగా నీళ్లు పట్టుకొస్తే రోడ్లో గతుకులకి డ్రమ్ములు కులికి నీళ్లు ఒలికిపోతాయి" అనేవాడు డ్రైవర్. కాబోలు అనుకునేది మా అత్తగారు.. ఒక్కోసారి ఒట్టి ఖాళీ డ్రమ్ములు తెచ్చేవాడు."ఏమిట్రా యిదీ, నీళ్లేవీ, అంటే "అయ్యో పెద్దమ్మగారూ! ఏం చెప్పమంటారు యీ లారీ వాళ్ళు కళ్ళు మూసుకొని తోల్తారు. లేచినేళ మంచిది. లేకపోతే కారే వుండేది గాదు. యిక నీళ్లంటే .. షడన్‌గా కారు తిప్పేశాను.. బండిపక్కనే వున్న పల్లంలోకి దిగింది.. డ్రమ్ములు దొర్లిపోయినయి" అంటూ డ్రైవర్ జరిగిందంతా యాక్షన్‌తో చెప్తూంటే మా అత్తగారు గుండె బాదుకుంటూ "హవురా! హవురా! ఎంత గండం తప్పింది! నీళ్ళు పోతే పోయినయ్ కారు దక్కింది" అనేవారు.

కాసేపటికి వెనక నుంచి మా పని పిల్లవాడు (డ్రైవర్ విరోధి) వచ్చి నాకు చెప్పేనాడు అసలు విషయం.. డ్రైవర్ వా, దోవలో కారాపి ఆడవాళ్ల దగ్గర బిందె అర్ధరూపాయి ప్రకారం నీళ్ళు అమ్ముతున్నాడండమ్మగారూ అంటూ.. అంతేగాదు ప్రతి రోజూ నీళ్ల కోసం ప్రొద్దుటే వెళ్లినప్పుడు నేరుగా నీళ్ళు పట్టుకు రాకుండా వాళ్ల యింటికెళ్లి వాళ్ల యిద్దరి పిల్లల్నీ కార్లో ఎక్కించుకుని స్కూలు దగ్గర దింపి తర్వాత నీళ్ళు పట్టుకొస్తాడమ్మా అని కూడా చెప్పాడు. అందుకే అంత ఆలశ్యం అవుతూంది రోజూ నీళ్ళు తేవడానికి.. యీ విషయం మా అత్తగారికి చెప్పడమా మానడమా!.. చెప్తే గొడవవుతుందని వూరుకున్నాను. యిక మీద కార్లో మంచినీళ్లు తేనక్కర్లేదని చెప్పేశాను డ్రైవర్‌కి. "మరి ఎట్లాగే మీకు నీళ్ళూ!" అన్నారు మా అత్తగారు..

"మీ అబ్బాయి గానీ, మీ మనవడుగానీ బయటి కెళ్లొచ్చే కార్లో ఆ రెండు, డ్రమ్ములూ పడేసి నీళ్ళు పట్టుకురమ్మంటే సరి.. యిక మీద మనుషులు లేకుండా నీళ్ల కోసం కారు పంపకూడదు" అన్నాను.

"అవునే! నేనూ అదే అనుకున్నాను. ఎంత పెట్రోలు! ఎంత ఖర్చు! మీరు నీళ్ళు తాగుతున్నారు! పెట్రోలు గదా త్రాగుతున్నారు." అంటూ వాళ్లబ్బాయితో చెప్పేశారు. విధిగా ఆయన బయటికెళ్లేప్పుడు కార్లో రెండు డ్రమ్ములూ పడేసి వెళ్లి యింటి కొచ్చేప్పుడు డ్రైవర్ చేత నీళ్ళు పట్టించుకు రావాలి అని, మనవడికీ అవూటే చెప్పారు.. కాలేజీకి వెళ్లేప్పుడు డ్రమ్ములు పట్టుకెళ్లి యింటికొచ్చేప్పుడు నీళ్ళు పట్టించుకు రావాలని మావారు చిరాకు పడుతూ "అసలెందుకీ బాధంతా సిమ్సన్ కంపెనీకి ఆర్డరిస్తే నూరు గేలన్ల నీళ్ళు పట్టే బండి ఒకటి తయారు చేసి యిస్తారు" అన్నారు.

"అట్లాగా! మరి నాకేం తెలుసు యీ తబిసీళ్లన్నీ, మసల్దాన్నీ. వెంటనే ఆర్డరివ్వు. అయితే ఆ బండికో బసవయ్య కావాలెగా" అన్నారు మా అత్తగారు.

"బసవయ్యెవరమ్మా" అన్నారు మావారికి అర్థంగాక.



"ఎద్దురా! బండికి ఎద్దు కావద్దూ!.."

"ఓహో! మన దగ్గరున్నట్లున్నయ్యే ఒకటో, రెండో ఎద్దులు!.."

"అవి ఆవుల్రా. ఎద్దులుగావు" అంటూ ఉలికిపడి నవ్వారు మా అత్తగారు..

"ఏమో! నాకేం తెలుసీ గొడ్ల గొడవ? బండి రెడీ చేయించడం వరకూ నా వంతు." అంటూ తప్పుకున్నారు.

"అయితే ఎద్దును కొనడం మా వంతట్రా!.. సరే మన మేనేజర్ని పంపు. రేపు శుక్రవారం పల్లావరం సంత కెళ్లి ఒక ఎద్దును తోలుకు రమ్మంటాను..."అన్నారు మా అత్తగారు..

శుక్రవారంనాడు మేనేజరు పల్లావరం సంతకు బయల్దేరాడు. ఎద్దును కొనే 'బడ్జెట్' నూటయాభై రూపాయలన్నారు మా అత్తగారు.. మేనేజరు ఇబ్బందిలో పడ్డాడు. "ఒకవేళ పాతిక రూపాయలు అటూ యిటూ అయితే ఫర్వాలేదా" అని నన్నడిగాడు మా అత్తగారు వినకుండా... ఫర్వా వుండదని చెప్పాను...

సాయంకాలానికి మేనేజరు తిరిగి వచ్చాడు.. "ఎద్దెక్కడా" అన్నారు మా అత్తగారు మేనేజరు జేబులు వెతుకుతూ... మేనేజరు వెలవెలబోతూ "నేను బస్సులో వచ్చాను.. ఎద్దును రేపు తోలుకొస్తారు. అదీకూడా మనకు రేపు ప్రొద్దుటే టెలిఫోన్ చేసి తోలుకొస్తారు. మిమ్మల్ని అడక్కుండా ఎట్లా తోలుకురమ్మనేది..ఎద్దు మాత్రం చాలా మంచిది. సాధువు.. మన నీళ్లబండికి సరిగ్గా వుంటుంది."

"అందుకే గదయ్యా నిన్ను సంతకు పంపింది.. అక్కడ మంచి గొడ్లు దొరుకుతాయి."

"యిది సంతలో దొరికిన గొడ్డు గాదండీ! సంతలో అన్నీ నాసిరకం గొడ్లున్నాయి. ఒక్కఎద్దుకూ బండిలాగే ఓపిక లేదు. ఒట్టి ఎముకల గూళ్లలా వున్నాయి గొడ్లన్నీ.. కొన్నయితే మరీ చిన్నదూడల్లా వున్నాయి. అక్కడొక ముసలాయన్ని విచారిస్తే తన దగ్గర మంచి ఎద్దు వుందన్నాడు పక్కనే వున్న పల్లెటూళ్లో.. సరే చూపించమన్నాను ఎద్దును.. చూడక్కర్లేదు. మైసూరు బసవేశ్వరుడిలా వుంటుంది ఎద్దు. అందానికి అందం వుంది. పరమసాధువు. ఎంతిస్తారు డబ్బు" అన్నాడు. నూటయాభై రూపాయలన్నాను.. మూడు వందల రూపాయలిస్తే యిస్తానన్నాడు.. చివరకు బేరం చేసి రెండువందల యాభైకి ఒప్పించాను." అన్నాడు మా అత్తగారి రియాక్షన్ కనిపెడుతూ. ఆమాట విన్న మా అత్తగారు ఉలిక్కిపడి

"రెండువందలయాభయ్యే! నీకేమన్నా మతిపోయిందటయ్యా? నీళ్లబండి లాగే ఎద్దును రెండువందలయాభైకి కొంటారా ఎవరన్నా..."

"అవునండీ నూటయాభైలో మంచి ఎద్దురాదన్నారు అక్కడి వాళ్లంతా.

"అక్కడి వాళ్లంతా అంటే అన్నారేం.. యిక్కడి వాళ్లు వుందన్నారు.. మన పాలవాడికి తెలిసినవాళ్ల దగ్గర ఏదో మంచి



ఎద్దు వుందట.. నూటయాభైకే యిస్తారట. తోలుకు రమ్మని చెప్తాను. ఆ పల్లావరం ఎద్దు అంత ఖరీదుపెట్టి కొనడం నాకిష్టంలేదు." అన్నారు మా అత్తగారు. పాపం మేనేజరు చిన్నబుచ్చుకున్నాడు.."సరేనండి ఆలాగే రేపు ప్రొద్దుటే వాళ్లు ఫోన్ చేస్తారు. మన నెంబరిచ్చి వచ్చాను. ఒద్దని చెప్పేసెయ్యొచ్చు.." అన్నాడు మేనేజరు.

"అడ్వాన్సేమైనా యిచ్చావా" అన్నారు, మా అత్తగారు మేనేజర్ని కొరకొర చూస్తూ...

"లేదండీ. ఒక్కరూపాయి యిచ్చి వచ్చాను శాస్త్రానికి.."అన్నాడు.

"ఒక్కరూపాయేగా పోతే పోయింది" అన్నారు మా అత్తగారు చప్పరిస్తూ..

ప్రొద్దుటే మా అత్తగారు పాలవాడు చెప్పిన ఎద్దు కోసం ఎదురు చూడ్డం మొదలెట్టారు.. పల్లావరంనుండి ఫోనొచ్చింది 'ఎద్దును తోలుకురమ్మంటారా' అని. నేను ఒక్కక్షణం ఆలోచించి, యీరోజు మంచిదికాదు రేపు ప్రొద్దుటే మళ్లీ ఒకసారి ఫోన్‌చేసి తోలుకురమ్మని చెప్పాను మా అత్తగారు వినకుండా.

పాలవాడు చెప్పిన ఎద్దును తోలుకొచ్చారు. ఆ ఎద్దును అయిదు మంది పట్టుకొచ్చారు తలనిండా తాళ్లుకట్టి బ్రహ్మాండమైన ఎద్దు. వంపుర్లు తిరిగి పెద్ద కొమ్ములతో తల వూపుతూ పట్టుకున్న వాళ్ల చేతుల్లో నిలవకుండా చిందులు తొక్కుతూన్న అంత పెద్ద ఎద్దును చూసి మా అత్తగారు నిర్ఘాంతపడి పోయారు.

అంత పెద్ద ఎద్దు ఎందుకు నీళ్ల బండికి అంటారనుకున్నాను..కాని తక్షణం మా అత్తగారి పెదాల మీద చిరునవ్వు కనిపించింది. ఏదో ఆమెకు స్ఫూర్తి వస్తేనే అటువంటి చిరునవ్వు కనిపిస్తుంది.. నన్ను దగ్గిరికి రమ్మని సైగ చేశారు.. నా చెవిలో చెప్పారు. 'ఎద్దు గొప్పది.. యింత పెద్ద ఎద్దు నూటయాభై రూపాయలకు దొరకడం చాలా అదృష్టం అనుకోవాలి.. ఏమంటావ్' అన్నారు.. నిజమే అంత తక్కువ ఖరీదుకు దొరికే ఎద్దుగా కనిపించదు.. కాని ఎందుకు దొరుకుతుందో దానిలో ఏం లోపంవుందో అనే అనుమానం కలిగింది. అంతమంది మనుషులు దాన్ని పట్టుకోడం, ఎద్దు ఒకచోట నిలవకుండా తలవిసురుతూ చిందులు తొక్కడం చూస్తే నా అనుమానం ఎక్కువైంది. మా అత్తగారితో

అత్తగారూ...

చెప్పాను.. ఆమె అలక్ష్యంగా చప్పరించి "యివన్నీ యీ ఎద్దుల్ని అమ్మేవాళ్ల ట్రిక్కులే.. నాకు తెలీవనుకుంటారు వెధవలు.. ఎద్దు చాలాగొప్పది అని తెలియ జేయడం కోసం అంతా హంగామా. దారిన పోయేవాళ్ల నెవర్నో కాస్త ఎద్దును పట్టుకు రమ్మని వుంటారు.. అంతా నాటకం'' అన్నారు. కాబోలు ననుకున్నాను.

''ఎద్దును అంతమంది పట్టుకుంటే, ఎట్లారా, బండికి కట్టి చూడండి''అన్నారు మాఅత్తగారు. బండి తెచ్చి కట్టారు బండి మీాద రెండుగజాల ఎత్తున్నది ఎద్దు. మా బండివాడు పొట్ట చెక్కలయ్యేట్లు నవ్వడం మొదలెట్టాడు.. యింకా ఎద్దును అయిదుగురు పట్టుకోడం చూసి "యింకా మీరంతా ఎందుకర్రా ఎద్దును పట్టు కుంటారు!.. ఒదిలేయండి.. మా బండి వాడు తోలిచూడాలి.'' అన్నారు మా అత్త గారు.

''బాబోయ్ పెద్దమ్మగారూ పిల్లామేకా గలోణ్ణి నే తోల్ను'' అన్నాడు మా బండి వాడు.

ఎద్దును పట్టుకున్న అయిదుగురూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. ముందు వైపు పట్టుకున్న యిద్దరు ఎద్దును వదిలేశారు. తక్షణం ఎద్దు ఒక్క విదిలింపుతో వెనక వాళ్లను కిందికి తోసి బండితో సహా క్రిష్ణలీలల్లో రాక్షసుడిలా మాయమైంది..'' ఆ.. అంటూ అందరం నిర్ఘాంతపోయి ఎద్దుకోసం వెనక పరిగెడు తున్నవాళ్లను చూస్తూ వుండిపోయాం...

అప్పుడే వచ్చిన మేనేజరు చెట్టు వెనక నుంచి వచ్చాడు మెల్లిగా.. మా అత్తగారు అతని ముఖం మాశ్లేక అవస్థపడ్డారు ...

''చాలా పోకిరీ ఎద్దు.. అబ్బా! ఎంత పెద్ద ఎద్దండీ''.. అన్నాడు హడలెత్తిపోయిన మేనేజరు.

''మరి ఆ పల్లావరం ఎద్దు తోలుకు రమ్మని చెప్తామా'' అన్నాను.

''ఆ మరి ఏదో కావాలిగా బండికి!.. దొంగవెధవలు ఏదో మంచి ఎద్దే తెస్తారు గదా అనుకున్నాను..'' అని సణుక్కుంటూ లోపలి కెళ్లారు.. మర్నాడే మా నీళ్లబండి బసవయ్య వచ్చాడు పల్లావరం నుంచి.. బస వయ్య ముఖంలో కళ, అణుకువ, ఓర్పు, గంభీరం ఒకటేమిటి! అన్ని మంచి లక్ష ణాలూ కనిపించాయి.. అన్ని సుగుణాలూ మూర్తీభవించిన బసవయ్య బండికి సరి పోయాడు. బండి లాగించి ట్రైల్, చూశారు.. యీ మహా సంసారాన్ని లాక్కె ళ్తున్న భగవంతుడిలా ఆ బండిని నెమ్మ దిగా, హుందాగా లాక్కెళుతున్న బసవయ్య అందరి మన్ననలకూ పాత్రుడయ్యాడు.. బండివాడు బసవయ్యను ముద్దుపెట్టుకని దిష్టి తీశాడు.

రోజూ బండివాడు బసవయ్య సుగుణా లను మెచ్చుకుంటూ ఒక్కదెబ్బ తిన కుండా సౌంజ్ఞలతో నీళ్లబండి లాక్కొస్తు న్నట్లు చెప్పాడు..

మా అత్తగారికి బసవయ్యంటే చాలా అభిమానం ఏర్పడ్డది. తనే స్వయంగా తెలగపిండీ, పొట్టూ వగైరా తినిపించేది బసవయ్య చేత.. ఉలవ పిండి రెండుపూటలా

పెట్టించేది.. బసవయ్య అన్నీ తాపీగా పుచ్చుకుంటూ బండి కట్టే వేళకు తనం తట తనే వచ్చి బండి దగ్గిర నిలబడేవాడు... ''ఆహా! ఆహా! యిది ఎద్దుగాదే!.. యిది మనిషీగాదు.. మనుషుః కింత జ్ఞానం, ఎక్కడిది.. కేవలం పూర్వజన్మలో మహర్షి నన బసవయ్యా..''అంటూ మా అత్తగారు బసవయ్యను మెచ్చుకునేవారు మా అత్త గారు..

వున్నట్లుండి మా బండివాడి తల్లి పోయిందని సడన్‌గా వాళ్ల వూరు వెళ్లి పోయాడు. వాడు వెళుతూ ఎవర్నో తెలిసిన వాడిని బండి నీళ్లు తేవడానికీ తోట పనికీ పెట్టి వెళ్లిపోయాడు.

ఆ కొత్తవాడు మా అత్తగారికి నచ్చలా. వాడు జట్కావాడు కావడం, బీడీలు తాగడం వాడి ప్రవర్తన చూసి "వీడొట్టి రౌడీవెధవే'' అన్నారు మాఅత్తగారు.

కొత్తవాడు మాఅత్తగారికే కాకుండా మా బసవయ్యకు కూడా నచ్చలే.. మొదటి రోజు బండి కడుతూనే ఒక్క చరుపు చరి చాడు. బసవయ్యకు ఓర్పెక్కువ గనక తమాయించుకున్నాడు. కొత్తవాడికి అడ్రసు తెలీదని మాపాత యింటి అడ్రసు రాసి బండివాడి చేతికిచ్చారు. బండివాడు ఎవర్నీ అడిగే అవసరం లేకుండానే నేరుగా బండి మాపాత యింటికి తీసుకెళ్లాడు బస వయ్య. అందుకే అది ఎద్దుగాదే! మహర్షి... అన్నారు మాఅత్తగారు. ఒచ్చిన రెండో రోజు నీళ్లకు పోయిన కొత్త బండివాడు సాయంకాలం నాలుగు గంటలయినా రాక పోవడం చూసి "ఏమిటే! యీ కొత్త వెధవ బండినీ బసవయ్యనూ యింకా తీసు కురాలేదే'' అంటూ మా అత్తగారు ఆదుర్దా పట్టం మొదలెట్టారు.

సాయంకాలం ఆరుగంటలకు తోలు కొచ్చాడు బండిని తూలుతూ...

ఆరాత్రి భోజనానికి కూర్చోబోతున్న మా అత్తగారు వెండి కంచం, చెంబూ గ్లాసూ కనిపించడం లేదని ఖంగారు పడుతూ వంటవాడూ తనూ వెదకడం మొద లెట్టారు.. ఎక్కడా కనిపించకపోవడంతో కొత్త బండివాడిని అనుమానించారు... ''ప్రొద్దుటే బసవయ్యకు తెలగపిండీ, ఉలవ పిండీ కావాలని వంటింటి వేపు వచ్చాడు.. అందరం హాల్లో వున్నప్పుడు వాడు వెనక తారట్లాడుతూ వుండడం చూశానే..పోనీ వాడిని పోలీసులకు పట్టిస్తే'' అన్నారు. 'ఒకవేళ వాడు తియకపోతేనో' అన్నారు మిగతా వాళ్లు..

ఏం చేయాలో తోచక మా అత్తగారు ఆ వెండికంచాన్నీ, చెంబునూ వర్ణిస్తూ అవి రెండూ తనకు చేసిన సేవనూ ఆ వెండి యొక్క ఔన్నత్యాన్నీ, ఆ వెండి ఎన్ని పాత వెండి పాత్రల నుండి గ్రహించబడ్డదీ, ఆ పాత్రలన్నీ ఏనాటివో, ఎట్లాంటి సంద ర్భాల్లో చేయించబడ్డవో, అవన్నీ కరిగించి చివరకు కంచం, చెంబూ తయారు చేయిం చానని వాటి హిస్టరీ చెబుతూ కంట తడి బెట్టారు.. పోనీ లేమ్మా యింకో చెంబూ కంచం చేయించుకోవచ్చులే అని కొడుకు ఓదార్చినా ఆ కంచం చెంబూ గొప్పతనం వాటిలో వుండే వెండి యొక్క 'క్వాలిటీ' రాదని చెప్పి బాధపడ్డారు.

ఆ సమయంలోనే మా పాత బండివాడు వచ్చాడు.. వాడిని చూస్తూనే మా అత్తగారి

ప్రాణం లేచొచ్చింది.. జరిగిందంతా వాడికి ఒక్కక్షణంలో చెప్పి తన అనుమానం అంతా ఆ కొత్త బండివాడి మీదే వుందన్నారు. వాడు కూడా సందేహిస్తూ నేను నెమ్మదిగా కనుక్కుంటా నమ్మగారూ మీరు దిగులు పడకండి..అంటూ మా అత్తగారికి హామీ యిచ్చాడు.

మర్నాడు కొత్తవాడిని తోటవని చూసొస్తాండమని చెప్పి పాత బండివాడు బసవయ్యకు ప్రేమగా తిండిపెట్టి, నీళ్ళు తాగించి, బండి కట్టి తీసుకెళ్ళాడు.

పాతవాడు మామూలుగా వచ్చే టైమ్‌కి రాలేదు.. వీడికీ ఏమొచ్చిందో తెగులు అని సణుక్కుంటూ, నా కంచం, చెంబూ, ఏమయినాయో అంటూ కలవరిస్తూ కూర్చున్నారు మాఅత్తగారు..

గేట్లో బసవయ్య మెళ్లో గంటల చప్పుడు వినిపించింది. మరుక్షణం, మాపాత బండివాడు, 'పెద్దమ్మగారూ పెద్దమ్మగారూ' అంటూ పరుగెత్తుకుంటూ లోపలికొచ్చాడు. "ఏమిట్రా! ఏమైంది"..అంటూ మా అత్తగారు ఎదురెళ్ళారు.. వాడు సంతోషంతో ఉక్కిరిబిక్కిరై మాటలు రాక అవస్థపడి, "మీవెండి కంచం, చెంబూ దొరికినయ్ అమ్మగారూ...." అంటూ చేతిలో వున్న పాత గుడ్డల మూట విప్పి చెంబూ కంచం బయటికి తీశాడు... మా అత్తగారు సంతోషంతో పొంగిపోయి బండివాడిని ఎంతో మెచ్చుకుంటూ వందేళ్ళు బ్రతకమని దీవించారు. ఆనంద భాష్పాలను తుడుచుకుంటూ— వాడు ఆ దీవెనలన్నీ బసవయ్యకి చెందుతాయన్నాడు.

"బసవయ్య కెట్లా చెందుతాయిరా" అని అడిగారు మా అత్తగారు.

"మన బసవయ్య ఎద్దుగాదు పెద్దమ్మగారూ! నిజంగా అది బసవేశ్వరుడే.... మనం అంతా మొక్కాల్సిన నందీశ్వరుడు మన బసవయ్య.... బసవయ్యే లేకపోతే మీ కంచం చెంబూ దొరికేయి కావు."

"ఎట్లాగా!"

"అవునమ్మగారూ! నేను యీడ నుంచి బండి కట్టుకొని ఎళ్లాను గదండీ! నేను ఎప్పుడూ నేరుగా మన పాతింటి కెళ్లి నీళ్ళు తీసుకొని ఎక్కడా అక్కుండా యింటికొస్తానండి. అది అలవాటు.... యీ రోజు పోతావుంటే షడన్‌గా ఒక బీడీ దుకాణం ముందు ఆగాడండి బసవయ్య— నాకు ఆశ్చర్యం ఏసి ఏందిరా యిది? బసవయ్య యిక్కడెందుకాగాడు అనుకుంటూ వుంటే, ఆ కొట్టోడు నన్ను చూసినవ్వి 'ఎద్దు బలే తెలివైందే! నువ్వు లేనప్పుడొచ్చిన బండోడు నా కొట్లో బీడీలు కొనుక్కునేవాడులే. అందుకాగింది. అన్నాడు..' బసవయ్య బుద్ధిశాలి తనాన్ని ఏం మెచ్చుకోనే దమ్మగారూ! మళ్లీ బయల్దేరాను. నేరుగా రోడ్లో బోయేదల్లా షడన్‌గా మలుపు దిరిగి ఒక సందులోకి బండి లాక్కుపోయింది.. నేను ఎంతో మళ్లించాలని చూసినా నావల్ల గాలా. పక్కన మురిక్కాలవ పక్కన చిన్న చిన్న గుడిసెలు. ఆ సందులో బండి ఎళ్లడమే కష్టం. ఎందుకు బసవయ్య యిటెడుతున్నావని నేను అడుగుతుండంగానే వో గుడిసె ముందాగాడు బసవయ్య.. కిళ్లీ కొట్టుకాడ ఆగినట్లాగిందే అని అనుమానం గలిగింది.. బండి సప్పుడిని లోపల్నించి వో పడుసు పిల్ల పరిగెత్తుకొచ్చి "ఎవురయ్యో నువ్వు! మామ రాలేదా!"— అంది... వోహో అనుకున్నా.... బండిదిగి గబగబా లోపలి కెళ్లా.... నా కనుమానం ఎక్కువైంది.. ఒక పాశికేసి చూద్దాం పార్తుందేమో అనుకొని "చూడమ్మోయ్.. మీ మామ శానా యిబ్బందిలో వుండాడు.. వాడేమున్నా మీ దగ్గర దాచి పెట్టమని యిచ్చాడా!" అన్నా రహస్యంగా దాని చెవు దగ్గరకెళ్లి.... మొదట బిత్తరచూపులో తటపటాయించి తర్వాత అవునని తలూపింది.. రొట్టెరిగి నేతిలో పడ్డాదని ఆ పిల్ల తల్లికాడ చెప్పి, 'వాడిని పోలీసుల్లా వెతుకు తున్నారు. పట్టుకుంటే ఆడిచ్చిన వస్తువులు మీ యింట్లో వున్నాయ్యని చెప్తాడు. పోలీసులు మీ గుడిసెమీద పడతారు కాసేపట్లో' అని...



ఆ ముసల్ది బాబోయ్ అని పెద్ద కేకేసి నా రెండు చేతులూ పట్టుకుని "చూడు బాబూ ఆ ముదనష్టపోడు ఒక ఎండి కంచం, చెంబూ తెచ్చి వాకిచ్చి దాసి పెట్టమన్నాడు... నా పిల్లని పెళ్లి చేసుకుంటా నన్నాడు గదా అని బుద్ధి గడ్డితిని దాచిపెట్టా.... యిదుగో అట్టనే పెట్టిలో పెట్టా..." అంటూ యీ మూట తెచ్చి నా చేతికిచ్చి అది వాడి చేతికే యిచ్చెయ్యమని, పోలీసులకి సంగతి చెప్పొద్దని బతిమాలింది.... చెప్పనని చెప్పి ఆ మూట తీసుకొని అదే రావడం— నీళ్ళు గూడ

తేలా పెద్దమ్మగారూ...." అని వాడ చెప్తూతే

"హవురా! హవురా!! ఎంతపని, ఏంసంగతి ఆ జట్కా వెధవ ఒట్టి దొంగ వెధవ. నాకు వాడు వచ్చిన రోజే తెలిసి పోయింది-

ఏడీ! నా బసవయ్య! నా మహర్షి ఎక్కడ అంటూ గబగబ బయటికొచ్చి బం క్కట్టేవున్న బసవయ్యను పొగడ్తల్తో ముంచెత్తారు... దీర్ఘాయుష్మాన్‌తో వుం మని దీవించారు....

ఆ రోజు బసవయ్యకు గొప్ప విం చేశారు. బసవయ్య తిండి కొంత మేము తిన్నాం... ఆ రోజునుంచి మా నీళ్లబం బసవయ్యకు మా యింట్లో చాలా గొ స్థానం యివ్వబడ్డది.... బండివాడు మా నప్పుడు పొరపాటున కూడా ఏ కొట్ట దగ్గిరా బండి ఆపేవాళ్లు కాదు.. బసవయ్యంటే బండి వాళ్లకు హడల్.. ❙